

# కథా కౌముది

# పరిమళపు అర

నాదెళ్ళ అనూరాధ

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

ప్రొద్దున్నే శారద తయారవుతున్నంతసేపూ ఆరాటంగా ఇల్లంతా తిరుగాడుతున్న సరస్వతమ్మ, 'వెళ్లొస్తానమ్మా, జాగ్రత్త. భోజనం చేసి కాస్సేపు నిద్రపో. ఏదైనా అవసరం అయితే ఫోన్ చెయ్యి' అంటూ ఆమె ఆఫీసుకి వెళ్లిపోయాక వరండాలో కాస్సేపు కూర్చుని ఆనాటి దిన పత్రికను చదివే ప్రయత్నం చేసింది. మనసు నిమగ్నం కాలేదు. కొన్నాళ్లుగా ఆవిడకి ఆరోగ్యం బావుండటంలేదు. ఎప్పుడూ కడుపునొప్పనో, కడుపులో మంటనో బాధపడుతోంది. తన పనులు తను చేసుకుందుకు కూడా ఓపిక లేనట్టు నిస్త్రాణగా వుంటోంది.

తల్లి పడుతున్న అవస్థ శారద చూస్తూనే ఉంది. ఆవిడకి అలవాటైన డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లి అన్ని పరీక్షలూ చేయించింది. ఎక్కడా ఏ సమస్యా లేదని చెప్పి, ఆకలి వెయ్యటానికి, నిద్రపట్టటానికీ మందులు ఇచ్చేడు ఆయన. సరస్వతమ్మకి డాక్టర్ మీద నమ్మకం పోయింది. తను పడుతున్న బాధ ఏమిటో ఆయన పట్టుకోలేకపోయాడు అనుకుంది.

శారద ఏం చెయ్యాలో తోచక తల్లి ఆరోగ్య పరిస్థితి గురించి ఢిల్లీలో ఉన్న అన్నగారితోనూ, హైదరాబాదులో ఉన్న అక్కయ్యలతోనూ ఫోన్ లో మాట్లాడింది.

' ఆవిడ బాధ పడుతుంటే ఇన్నాళ్లు ఆలస్యం చేసేవెందుకు శారదా, వెంటనే డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లి చూబించు.' అన్నాడు అన్నగారు.

' తీసుకెళ్లానన్నయ్యా, డాక్టర్ దగ్గరకి వెళ్దాం అంటే వద్దంటుంది. ఆయన సరిగా చూడట్లేదు అంటుంది. పోనీ మరొకరి దగ్గరకి వెళ్దాం అంటే రాదు. తిండి బాగా తగ్గించేసింది. నీరసపడిపోయింది. తెల్లవార్లూ నిద్రపట్టదంటుంది. నువ్వొకసారి వస్తావేమో , నిన్ను చూస్తే ఆవిడకి కాస్త ధైర్యం వస్తుందని నీకు చెబుతున్నాను'

' ఒక్కరోజు శెలవు దొరకటం కూడా గగనమే. ఎలా రమ్మంటావే? నువ్వు దగ్గరున్నావు . ఆమాత్రం ఆవిడకి ధైర్యం చెప్పలేవూ?' అంటూ విసుక్కున్నాడాయన.

లక్ష్మి అక్క, రమణి అక్క వచ్చేందుకు వీలుపడదనీ, అశ్రద్ధ చెయ్యక తల్లిని వెంటనే ఆవిడకి నమ్మకమున్న మరో పెద్ద డాక్టర్కి చూబించమనీ చెప్పేరు. శారద నిట్టూర్చింది. అన్నయ్య, అక్కయ్యలకి తనకి వయసులో బాగా వ్యత్యాసం వుండటం వలన ఏంచెప్పబోయినా చిన్నపిల్లవంటూ తల్లి తన మాటని కొట్టిపారేస్తోంది. వాళ్లు వస్తే ఆవిడ సమస్య అర్థం చేసుకుంటారంటే వాళ్లకది పట్టదు.

చిన్నక్క రమణి అయితే, 'అమ్మ స్వతహాగా ఆరోగ్యమైనది. భోజనం సరిగా చెయ్యకపోతే నీరసం రాదూ? నిద్రెలా పడుతుంది? ఆవిడకిప్పుడు బాధ్యతలేం లేవు. తన గురించైనా కాస్త శ్రద్ధ తీసుకోకపోతే ఎలా? అయినా ఊర్కే ఖాళీగా కూర్చున్నా ఇలా ఏవో నొప్పులనిపిస్తాయి. ఇక్కడ

మా అత్తగార్ని చూస్తున్నానుగా. రోజూ పసిపిల్లలా బుజ్జగిస్తూ ఉంటాను ఆవిడని. అమ్మని  డాక్టర్కి చూపించు కానీ ఆవిణ్ణి వూర్కే కూర్చోబెట్టక ఆవిడకి చేతనైన చిన్న చిన్న పనులు చెయ్యనీ' అంటూ సలహా ఇచ్చింది.

★★★★★★★★

మరో నాలుగు నెలలు అలాగే గడిచేయి. శారద బలవంతంగా మరో డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళింది తల్లిని. కానీ సమస్య అలాగే ఉంది. ఆఫీసు పని ఒత్తిడితో తల్లిని ఆవిడ మానాన ఆవిణ్ణి వదిలి పెట్టింది శారద. సరస్వతమ్మ దిగులుగా ఉంటోంది. రోజూ ఏదో ఒక బాధతో అవస్థ పడుతోనే ఉంది. ఒక్కోరోజు శారద ఆఫీసుకెళ్ళే సమయానిక్కూడా నిద్ర లేవదు.

' అమ్మా, తొమ్మిది కావొస్తోంది. ఇంకా లేవలేదేం? లే, లేచి ముఖం కడుక్కుంటే కాఫీ కలిపిస్తాను' శారద మాటలకి అయిష్టంగా మంచం దిగేది. ఒక్కోసారి ' నాకు లేవాలని లేదే. ' అంటూ ప్రక్కకి ఒత్తిగిల్లి పడుకునేది.

ఆరోజు సాయంత్రం శారద ఇంటికొచ్చేసరికి తల్లి దగ్గర కూర్చున్న ప్రక్కింటి లలిత కనిపించింది. ఒక్కక్షణం భయం వేసింది, చెప్పులు విడిచి తల్లి మంచం దగ్గరకెళ్ళింది, 'ఏమైంది అమ్మకి?' ఆ వేళప్పుడు ఎప్పుడూ ఆవిడ పడుకుని వుండటం చూడలేదు శారద.

' గుండె దడగా ఉందని, ఏదో ఆందోళనగా ఉందని నన్ను పిలిచేరు. నాకు సాయంత్రం క్లాసులు లేవని పెందరాళే వచ్చేను ఈవేళ. డాక్టర్ దగ్గరకు వెళ్దామంటే వద్దని, కాస్సేపు తన దగ్గర కూర్చోమన్నారు. గంట క్రితం నేను వచ్చినప్పటికంటే ఇప్పుడు తేరుకున్నారు' లలిత మాటలకి దిగులు పడిపోయింది.

వెళ్తూ వెళ్తూ లలిత ,' ఆంటీ ఏదో డిప్రెషన్ ఫీలవుతున్నారు. నాలుగు రోజులు వీలైతే శెలవుపెట్టరాదూ?' అంది శారదతో.

అన్యమనస్కంగానే శారద వంట ముగించి తల్లి దగ్గరగా కూర్చుని, 'అమ్మా, నువ్వు దేని గురించైనా బెంగ పెట్టుకున్నావా? ఏమిటి నీ బాధ? నాకు చెప్పమ్మా.' చంటి పిల్లని సముదాయిస్తున్నట్టు తల్లిచేతుల్ని అనునయంగా రాస్తూ అడిగింది.

చెమరించిన కళ్లను దాచుకుందుకు ముఖం తిప్పుకుందావిడ.  శారద మనసు నీరైపోయింది తల్లిని అలా చూస్తూంటే .

ఆవిడని పరిశీలనగా చూసింది. ఆ ముఖంలో దిగులు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. మనిషి మరింత పలుచబడిపోయింది. తండ్రి వున్నప్పుడు ఎంత నిండుగా,నిబ్బరంగా వుండేది! ఏనాడైనా ఇలా తనకు బావులేదంటూ చెప్పిందా? నిజంగా ఒళ్లు వెచ్చచేసినా ఒప్పుకునేదా? జీవితాన్నినిత్యం ఒక పండుగలా చైతన్యవంతంగా నడుపుకున్న వ్యక్తేనా ఈవిడ?తల్లి ఏనాడైనా కన్నీరు పెట్టుకున్న సందర్భం తనకు జ్ఞాపకమే లేదు.

ఆవిడ జీవితంలో తండ్రి పాత్ర ఎంత బలమైనదో తనకు తెలుసు.ఆయన లేకపోవటాన్ని ఇన్నాళ్లైనా జీర్ణించుకోలేక ఇలా అవస్థ పడుతోందా? మానసికంగా నలిగిపోతూ శరీరాన్ని శుష్కింపచేసుకుంటోందా?

' శారదా, నీ జీవితం ఇలా అవటం చూడలేకపోతున్నానే. నాన్నగారు, నేను నీకు అన్యాయం చేసేం అని బాధగా ఉంది. అక్కయ్యల పెళ్లి విషయంలోనూ, అన్నయ్య పెళ్లి విషయంలోనూ మా నిర్ణయాలు తప్పు కాలేదు. నీ దగ్గర కొచ్చేసరికి.....' ఆవిడ మరి మాట్లాడలేకపోయింది.

' ఆ విషయం గురించి నువ్వు దిగులు పెట్టుకోవలసిన అవసరం లేదు. మీరు మంచిదని చూసి చేసిందే. మీ లోపం లేదు. ఆ వ్యక్తికి నాతోనే పేచీ. అతని గుణాల్ని దగ్గరగా చూసిన దాన్ని నేను. కల్సి బ్రతకలేను అని నిర్ణయించుకున్నది నేను. నాన్నగారు అర్థం చేసుకున్నారు. నేను సరైన నిర్ణయం తీసుకున్నానని ఆనాడు నువ్వూ ఒప్పుకున్నావు. అదొక పీడకల. అది ఆలోచించి నీ ఆరోగ్యం పాడుచేసుకోకు.' తల్లిని ఓదార్చింది.

' అమ్మా, నువ్వు కొన్నాళ్లు అన్నయ్య దగ్గరకో, అక్కయ్యల దగ్గరకో వెళ్తానంటే తీసుకెళ్లి దింపుతాను. నీకు వాతావరణం మార్పు ఉంటుంది. నీ ఆరోగ్యం కూడా కాస్త కుదుట పడుతుందేమో. వీలైతే ఇంకొక డాక్టర్ సలహా కూడా తీసుకోవచ్చు. ఏమంటావు?'

' శారదా, నేను ఏనాడూ ఇల్లు దాటి వెళ్లినదాన్ని కాదు. ఇంకెక్కడా ఉండలేనే.నా బలం ఈ ఇల్లే. ....... అలా అని ఇల్లు వదలక ఎప్పుడూ ఇక్కడే ఉంటానంటే నా బాధ్యత పూర్తిగా నీమీద పడిపోతోంది . నీకు సాయం చేసేందుకు ఎవరూ లేరు...............'

' నాకూ నిన్ను ఎక్కడికీ పంపటం ఇష్టం లేదమ్మా. కానీ నీకు కాస్త మార్పు అవసరమేమో అని ఆలోచిస్తున్నాను. '

' శారూ, ఎల్లకాలం  నువ్వు మాత్రం నాకోసం ఇక్కడ కూర్చుందుకు అవుతుందా? ఏమో, అప్పుడు ఏంచేస్తానో నాకు తెలియదు...........' ఆవిడకి మళ్లీ దుఖం ముంచుకొచ్చింది .

శారదకి తల్లిని ఎలా ఓదార్చాలో తెలియలేదు. తనకి అలాటి ఆలోచనలు లేవని మళ్లీ మళ్లీ చెబుతూనే ఉన్నా తల్లి ఆధోరణిలో ఆలోచిస్తూనే వుంది. అది ఆవిడకి అభద్రతని ఇస్తోంది అని అర్థం అవుతోంది.

' అమ్మా, ఈ రోజు నీకోసం ఒక మంచి కబురు తెచ్చేను. నువ్వేమో ఇలా దిగులుగా ఉండేసరికి ఆ విషయం చెప్పటమే మరిచిపోయాను' తల్లి ముఖంలో కొద్దిపాటి కుతూహలం కనిపించింది.

'నిన్ను చూడాలని,వినాలని, నీతో కబుర్లు చెప్పాలని మనింటికి రేపు ఒకరొస్తున్నారు.ఎవరో చెప్పుకో....' శారద మాటలకి ఆవిడ ముఖంలో కొంచెం వెలుగొచ్చింది.

' ఎవరూ?' అందావిడ తను చెప్పలేనని వెంటనే ఒప్పుకుంటూ .

' వాణి వదిన వస్తోందమ్మా'. కప్పుకుని నిద్రకి ఉపక్రమించబోతున్నదల్లా దుప్పటి తొలగించి లేచి కూర్చుంది ఆవిడ.

' ఏదైనా పనిమీద వస్తోందా?'

' నిన్ను చూడాలని, నీకోసం వస్తోంది. ఏ రైలుకి వస్తుంది,ఎన్నింటికి అనేది నాకు చెప్పలేదు. రైలు దిగి హాయిగా రిక్షా ఎక్కి ఊరు ఎంత మారిందో చూస్తూ వస్తానంది. ప్రొద్దున్నే నువ్వు లేచేసరికి వచ్చేస్తుంది. హాయిగా పడుకో అమ్మా.' సరస్వతమ్మ ముఖంలో ఆనందం దాగలేదు. నెమ్మదిగా పక్కమీదకి ఒరిగింది. నిద్ర మాటేమోగానీ ఆవిడ ఈ మధ్య కాలంలో ఎన్నడూ అనుభవించని ఆనందం ఆవిడని కమ్ముకుంది. ఆలోచనలు పాత రోజుల్లోకి వెళ్లేయి............

పదహారేళ్ల సరస్వతి పెళ్లైవచ్చేసరికి, వాణి తల్లిని పోగొట్టుకుని అమ్మమ్మ ఇంట్లో అందరికంటే ఎక్కువగా ఆదరణని, ప్రేమని అందుకుంటోంది. సరస్వతికి ఆ రెండేళ్ల పిల్ల అందరికంటే ఎక్కువగా చేరికైంది. మొదటిసారిగా తల్లిదండ్రుల్ని వదిలి అత్తవారింటికి వచ్చిన సరస్వతి ఇంటి మీద, తల్లి మీద ఉన్న బెంగని ఆ పిల్లని చేరదీయటంలో తీర్చుకునేది.

వాణికి ఏడెనిమిదేళ్ల వయసు వచ్చేసరికి ఆమె తండ్రి మళ్లీ పెళ్లి చేసుకోవటంతో, అత్తవారింట్లో పెరుగుతున్న కూతుర్ని తనతో పాటు తీసుకెళ్లిపోయాడు ఆయన. ఇల్లంతా బోసిపోయింది. సరస్వతైతే స్వంత బిడ్డని పరాయి ఇంటికి పంపిస్తున్నంత బాధ పడింది. కాని ఆ చిన్నపిల్ల తండ్రి ప్రేమకు దూరం కావటం న్యాయం కాదని సర్దుకుంది.

ఈలోపు తనకీ పిల్లలు పుట్టుకురావటంతో వాళ్ల ఆలనా పాలనల్లో పడిపోయింది. వాణి శెలవులకి, పండుగలకి వచ్చిపోతూ ఉండేది. ఆ అమ్మాయి మనసులో సరస్వతిఅత్తయ్యంటే ఒక ప్రత్యేకమైన స్థానం ఏర్పడిపోయింది. ఆ అనుబంధం పెద్దై, పెళ్ళై వెళ్లిపోయినా కొనసాగుతూనే ఉంది.

తెల్లవారకుండా లేచి స్నానం చేసి వీధి వరండాలో కూర్చున్న తల్లిని చూసి శారద హాయిగా ఊపిరిపీల్చుకుంది.

వాణి వస్తూనే శారద చేతిలోంచి కాఫీ అందుకుంటూ చెప్పేసింది..

' శారూ , ఈ రోజు అత్తయ్య, నేను ప్రొద్దున్నేపలహారం చేసి, పదకొండు గంటల ఆటకి కన్యాశుల్కం సినిమా చూసి లంచ్ బయట చేసేస్తాం. నువ్వూ మాతో చేరతానంటే శెలవుపెట్టేయి మరి' అంది.

' ఇప్పుడు కన్యాశుల్కం ఎక్కడదొరికింది వదినా నీకు?'శారద నవ్వింది.

' స్టేషన్ నుంచి వస్తూ, ఊళ్లో ఉన్న సినిమాలు గురించి వాకబు చేసే వచ్చేనే శారదా. నువ్వూ వస్తావా చెప్పు?'

' నాకు ఆఫీసులో ఇనస్పెక్షన్ జరుగుతోంది, రాలేను. అయినా అమ్మ బయటకు వెళ్లటం అంటే ఒక్క హాస్పటల్ వరకే. నువ్వు ఇంత పెద్ద ప్రోగ్రామ్ పెట్టేవ్'

‘ శుభ్రంగా వస్తుంది. ఓపిక లేకపోవటం ఏమిటి? రోజూ ఇంట్లో కూర్చోవటమేగా. ఏం అత్తా , ఈరోజు మనం సినిమాకి, లంచ్ కి బయటకు వెళ్తున్నాం , సరేనా?’ సరస్వతమ్మని ఉత్సాహపరిచింది. ఆవిడ ఆనందంగా తలూపటం చూసి శారద విస్తుబోయింది. అంతలోనే తల్లి సంతోషం చూసి మనసు నిండిపోయింది.

‘ అత్తయ్యా, చిన్నప్పటి కబుర్లు నీతో మళ్లీ చెప్పించుకోవాలని ఎన్నాళ్లుగానో ఆశ. మా అత్తగారికి కంటి చూపు బాగా తగ్గిపోయింది ఈ మధ్య, ఆవిడని వదిలి రావాలంటే కుదరదు, అదీకాక నేను లేకపోతే ఆవిడ వుండలేరు. ఒక్కక్షణం నేను బయటకు వెళ్లినా గొడవ పెడతారు . మా పిన్నత్తగారిని కూడా ఈ మధ్య మా ఇంటికి తీసుకొచ్చేసేను. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. అక్కచెల్లెళ్లు ఇద్దరూ ఈ వయసులో ఒకరికి ఒకరుగా వుంటారని ఒప్పించేను. ఎటూ ఇంట్లో అన్నీ చూసుకుందుకు ఆయా ఒకామె ఉంది. వాళ్లకి నచ్చచెప్పి రెండు రోజులు వచ్చేందుకు ఏర్పాటు చేసుకున్నాను . ‘

సరస్వతమ్మ వాణి చెబుతున్న విషయాలన్నీ వింటోంది. గతాన్ని కళ్లముందుకు తెచ్చుకునే ప్రయత్నం చేస్తోంది. ఆ ఆలోచనలు ఆవిడకి చెప్పలేనంత బలాన్ని ఇస్తున్నాయి. మనసులో ముద్ర పడిన జ్ఞాపకాలను మేనకోడలితో కలిసి తియ్యతియ్యగా పంచుకోవటం మొదలుపెట్టింది. కాలాన్ని శాసించేది తనే అన్నంత సంబరంగా ఆ రెండు రోజులు రాత్రి, పగళ్ల సరిహద్దుల్ని చెరిపేసిందావిడ.

★★★★★★★

వాణి మరునాడు ప్రయాణమై వెళ్తుందంటే అప్పుడే సరస్వతమ్మకి దిగులు మొదలైంది. వరండాలో తీగలై సాగి, పూల భారంతో అల్లుకున్నసన్నజాజుల్నికోసి మాల కడుతూ కూర్చున్నారిద్దరూ. అకస్మాత్తుగా సందె వెలుగుల్ని కమ్మేస్తూ ఆకాశమంతా మేఘాలు పరుగులు మొదలుపెట్టేయి. ఎక్కడో దూరంగా వర్షం కురవటం మొదలైనట్టుంది.

‘అత్తా,అప్పుడప్పుడు నువ్వు మా ఇళ్లకి వచ్చిపోతూ ఉంటే మాకు బావుంటుంది. నీ చేతుల్లో పెరిగిన మేము ఎలా జీవిస్తున్నామో నువ్వు చూడద్దా? ‘ ఉపోద్ఘాతంగా అంది వాణి.

‘ నా ఆరోగ్యం అంత బావుండటం లేదు వాణీ. డాక్టర్లు ఏమీ లేదంటారు. నా బాధ ఎవరికీ అర్థం కాదు. ఉన్నారని చెప్పుకుందుకు నలుగురు పిల్లలు. వాడు ఎక్కడో దూరంగా వున్నాడు. ఉద్యోగరీత్యా తప్పదు. కానీ ఏడాదికొకసారైనా కంటికి కనిపించాలని కోరుకోవడం న్యాయమైనదే కాదూ?

ఆడపిల్లలిద్దరూ వాళ్ల నాన్నగారు ఉన్నప్పుడు ఏం వచ్చేరో అంతే, ఆ తర్వాత రావటం క్రమంగా తగ్గిపోయింది, మంచికీ ,చెడుకీ ఆయన సలహాకోసం వచ్చివెళ్తూండేవారు.నేను ఉన్నానన్న జ్ఞాపకం లేదు వాళ్లకి. ఇప్పుడు రావటానికి సమయమే లేదంటారు. అంతెందుకు? నెలకోసారైనా ఫోన్ చేసి అమ్మతో మాట్లాడాలనుకోరు. ఎప్పుడో ఒకసారి ముక్తసరిగా ‘బావున్నావా’ అని పలకరిస్తారు.

వాళ్లతో నాలుగు మాటలు పంచుకోవాలని వుంటుంది. ఇంటికొస్తే దగ్గర కూర్చోబెట్టుకుని వాళ్ల పసితనపు రోజుల్ని మరోసారి మననం చేసుకోవాలని వుంటుంది. ఏదీ, రారే. ...’

‘ శారదని చూస్తే దీని జీవితం ఇలా అయింది. ఈ వయసులో నాకు తోడుగా వుండటంకోసమే ఇలా అయిందా అని దిగులుగా వుంటుంది. ఏమో, రేపు శారద జీవితంలో మంచి మార్పులొస్తే అది ఇక్కడ వుండటం సాధ్యమేనా?, నా సంగతి ఏమిటి? అని ఆలోచన. మరోప్రక్క అలాటి మార్పు రావాలని కోరుకుంటూనే ఉన్నాను .

ఈ పరిసరాల మీద మమకారం వదలలేక పోతున్నాను. పిల్లల దగ్గరకి వెళ్లడానికి మనస్కరించదు. ఇవన్నీ ఆలోచించకుండా ఎలా వుండగలను?........’ ఇంక ఏమీ మాట్లాడ లేనట్లు కూర్చుండిపోయిందావిడ.

వాణికి ఆవిడ మనసు అర్థమైంది. ' అత్తా, ఈ ఆలోచనలన్నీ మానసికంగా నీమీద ఒత్తిడి తెస్తున్నాయి. అది శరీరం మీద ప్రభావం చూబిస్తోంది. పిల్లలు పలకరించటం లేదని దిగులు పెట్టుకుంటే ఎలా అత్తా? శరత్ ఆ సిటీలైఫ్ లో ఎంత సతమతమవుతున్నాడో నీకు తెలియదనిదా?తనున్న పొజిషన్ కి ఎప్పుడంటే అప్పుడు శెలవులు తీసుకుందుకు సాధ్యం కాదు.

లక్ష్మి ఇద్దరు మనవరాళ్లని బేబీ సిట్టింగ్ చేస్తోంది. రావాలని ఉన్నాఎలా కుదురుతుంది? రమణి ఉద్యోగం, పిల్లల చదువులు తో వూపిరి పీల్చుకునే వ్యవధి లేదు.

రమణి కాలికి ఫ్రాక్చర్ అయి మూడు నెలలు మంచం మీద ఉంది. తను కొంచెం తేరుకునేసరికి వాళ్ల అత్తగారికి బావులేదు. చాలా అవస్థ పడుతోంది. వంట మనిషి వచ్చీ రాక ఇంట్లో ఒక రకమైన ఇబ్బంది, పిల్లలతో మరికొన్ని సమస్యలు. ఆయన ఫారిన్ టూర్లతో బిజీగా ఉన్నాడు. ఆయన వైపు నుండి పిసరంత సాయం లేదు. మొన్నీ మధ్య కలిసినప్పుడు ఇవన్నీ తెలిసాయి. నీకు ఈ సమస్యలన్నీ చెబితే నువ్వు బెంగ పెట్టుకుంటావని నీకు చెప్పలేదు. నీకు బావుండట్లేదని శారద ఫోన్ చేసి చెప్పినా వచ్చిచూసే అవకాశం లేదని బాధపడింది.

నీకు మాట్లాడాలనిపించినప్పుడు నువ్వే ఫోన్ చేసి పిల్లలతో మాట్లాడత్తా. మాట్లాడాలన్న ఆశ తీరుతుంది. పిల్లలూ నీ పలకరింపుకి ఎంత సంతోషిస్తారో నేను చెప్పాలా? నువ్వంతట నువ్వుగా వచ్చి నాలుగురోజులు మాతో గడిపావంటే మాకెంత బలం!

శారద సమస్యకి కాలం సమాధానం చెబుతుంది. తనకి నచ్చిన వ్యక్తి కనిపిస్తే పెళ్లికి సిద్ధపడొచ్చు. అప్పుడు మాత్రం నిన్ను చూసుకుందుకు ఎవరూలేరని ఎలా అనుకుంటావు? మేమందరం లేమా అత్తా నిన్ను చూసుకుందుకు ? నీ ఈఆలోచనలన్నీ అధిగమించలేని నీ శారీరక బలహీనతలనుండీ పుట్టినవే.

మమ్మలనందరినీ ఎంత శ్రద్ధగా, ఓర్పుగా పెంచేవు! మా జీవితాల్లో ధైర్యంగా సమస్యల్ని ఎదుర్కొనే బలాన్ని నువ్వు కాదూ ఇచ్చింది?!'

సరస్వతమ్మ వాణి మాటల్లో యదార్థాల్ని తెల్లబోయి వింటోంది. రమణి కాలుకి దెబ్బ తగిలినట్టే తనకు తెలియదు.........ఎలా జరుపుకుందో ఆరోజులన్నీ?ఎంత ఇబ్బంది పడిందో?!

తనకు తెలిసి ఉంటే సాయంగా వెళ్లేదేనా తను? ఆ తల్లిమనసు ఆర్ధం అయింది. వాణి మాటల ప్రవాహం ఇంకా సాగేదేమో కానీ ప్రక్కింటి రమ్య పరుగెత్తుకుంటూ వచ్చింది,

' అమ్మమ్మా' అంటూ.......సరస్వతమ్మ ప్రక్కన కూర్చున్న వాణిని చూసి నిలబడిపోయింది .

' ఎవరీ మనవరాలు? ' అంటూనే ,

' రామ్మా , మీ అమ్మమ్మ నాకు అత్తయ్య అవుతుంది. ' అంటూ రమ్య ని ఆహ్వానించింది వాణి.

ఆ పలకరింపుతో వచ్చి ప్రక్కనే కూర్చుంది రమ్య.

' అమ్మమ్మా, మా స్కూల్లో ఒక వ్యాసం రాసుకురమ్మన్నారు. ఏదైనా ఒక క్రొత్త విషయం అమ్మమ్మల్ని అడిగి తెలుసుకుని రాయాలి.........'

' క్రొత్త విషయాలు అమ్మమ్మ ఏంచెబుతుందే రమ్యా. నువ్వే నాకు బోలెడు విషయాలు చెబుతుంటావు కదా' సరస్వతమ్మ నవ్వింది.

ఇంట్లోకి అడుగుపెడుతున్న శారద నవ్వుముఖంతో ముందు వరండాలో కూర్చుని రమ్యతో కబుర్లు చెబుతున్న తల్లిని చూసింది. ఆవిడ చేతిలో సన్నజాజుల మాల . ఎంత నాజూగ్గా,ఎంత వేగంగా మాల కడుతున్నాయి ఆ బలహీనపు చేతులు.

ఆవిడ తనకుందంటున్న అనారోగ్యం కేవలం ఒంటరితనం వలన వచ్చిన మానసికభావనేనా? రెండురోజులుగా ఆవిడలో ఎంత మార్పు?!

ఆ దృశ్యాన్ని కళ్లనిండా చూస్తూ చెప్పులైనా విడవకుండా అక్కడే కూర్చున్న కూతుర్ని చూసి కబుర్లు ఆపి ,

' శారూ, కాస్త కాఫీ పెట్టి తెచ్చిపెట్టనా తల్లీ' అంటూ అడిగింది సరస్వతమ్మ.

'వద్దమ్మా, స్నానం చేసి వచ్చి కలుపుకుంటా' అంటూ బలవంతంగా అక్కణ్ణుంచి లేచింది .

' ఇంతకీ నేను చెప్పగలిగే విషయాలేం వున్నాయో చెప్పు రమ్యా'

‘ అమ్మమ్మా, మేము వూరెళ్లివచ్చినప్పుడల్లా మీరు పాలు, పెరుగు సిద్ధం చేసి పెడతారెందుకు? అన్నీ దొరుకుతాయి కదా. ఎప్పుడూ అడుగుదామని అనుకుంటాను.......’ రమ్య ప్రశ్నకి సరస్వతమ్మ నవ్వుతోంది .

‘ ఇదివరకు ఇప్పటిలా ఎప్పుడుపడితే అప్పుడు, ఎక్కడపడితే అక్కడ పాలు, పెరుగు దొరికేవి కావు. అందుకే పొరుగింటి వాళ్లైవరికైనా ఇలాటి అవసరాలు వచ్చినప్పుడు ఒకరికొకరు సాయం అందించుకునేవారు.’

రమ్య ఆశ్చర్యంగా వింటున్నదల్లా ,

’ అదేమిటి? దొరక్కపోవటం ఏమిటి? భలే క్రొత్తగా వుందే. అలా దొరక్క పోతే ఎలా ? పొరుగింటి వాళ్లు సాయం చేసి తీరాల్సిందేనా? అంత తీరుబడి ఎవరికుంటుంది?’

‘ తీరుబాటు వుండటం లేకపోవటం కాదు. తమతోటి ఇరుగుపొరుగువారు,నిత్యం కలిసిమెలిసి ఒక కుటుంబంలా వుండే మనుషులు ప్రయాణం చేసి వచ్చి, అలిసిపోయి వుంటారు. ఆ ప్రయాణం ఎలా జరిగిందో , వాళ్లు వెళ్ళిన పని సక్రమంగా పూర్తి చేసుకొచ్చేరో లేదో, దూరాన ఉన్న వాళ్ల వాళ్లంతా ఎలా వున్నారో అన్నీ కనుక్కుని వాళ్ల యోగ క్షేమాల్ని కనుక్కోవటం ఒక ఆనవాయితీ గా అందరం అనుసరించేవారం. అదే అలవాటు ఇప్పటికీ మా తరం వాళ్లకి.

అయినా రమ్యా,నువ్వు మాత్రం సమాజ సేవ అంటూ ప్రతి ఆదివారం నీ స్నేహితులతో వృద్ధాశ్రమాలకీ, అనాథశరణాలయాలకీ వెళ్లి సేవ చెయ్యటం లేదూ?’

‘ అది వేరు అమ్మమ్మా, వాళ్లకి సేవ చేసేవాళ్ల అవసరం ఉంది. ‘

‘ నువ్వు అవసరం అన్నావే, అలాటి అవసరం ఇరుగుపొరుగులమధ్య, కుటుంబ సభ్యులమధ్య వుండవలసిన ప్రేమ, సహకారం, అవగాహన తగ్గిపోతూండటం వల్లనే కలుగుతోంది. నువ్వు చెప్పు, ఊరు నుండీ రాంగానే నేను వచ్చి పలకరిస్తే నీకు సంతోషం గా వుండదూ, అమ్మమ్మ నాకోసం ఎంత ప్రేమగా ఎదురుచూస్తున్నారు అనుకోవూ?’ సరస్వతమ్మ నవ్వుతూ రమ్యని ప్రశ్నిస్తోంది.

అమ్మమ్మా, మనవరాళ్లమాటలు సాగుతూనే వున్నాయి చాలాసేపు.

వాణి లోపలికి నడిచింది. పెరట్లో ఆరిన బట్టలు తీసుకొస్తున్న శారద ఆమెకి ఎదురెళ్లింది..........

‘ వదినా, నువ్వు ఉన్న ఈ రెండు రోజులు అమ్మ ఎంత ఉత్సాహంగా ఉందో చెప్పలేను. నేను రోజూ చూసే అమ్మేనా అని ఆశ్చర్యం వేస్తోంది. నువ్వు వెళ్లిపోతావంటే అమ్మకంటే ముందు నాకు దిగులుగా ఉంది.’ శారద మాటలకి వాణి నవ్వింది.

‘శారూ, ఏళ్లతరబడి ఉమ్మడి కుటుంబంలో ఉండి,తన చుట్టూ ఉన్నవాళ్లందరి అవసరాలు తీర్చేది తను మాత్రమే అన్న ఒక ఆత్మవిశ్వాసంతో అత్తయ్య రోజులు గడిచిపోయాయి. నెమ్మదినెమ్మదిగా వయసు పెరుగుతూ ఓపిక తగ్గుతుంటే బాధ్యతలు తగ్గి తనకీ, మామయ్యకీ పరిమితమవుతూ జీవించిన రోజులు, ఆ తర్వాత మామయ్య లేని వెలితి, చుట్టూ ఆవరిస్తున్న ఒంటరితనం, శారీరక అసహాయత ఇవన్నీ ఆవిడని కృంగదీస్తున్నాయి. ఇది అందరి కథ, ఇంటింటి కథ.

ఆవిడ తను చెయ్యాల్సినదేం లేదని, తన ఉనికికి అర్థం లేదని భావిస్తోంది. తను ఎవరికీ అవసరం లేదని అనుకుంటోంది. కానీ మనకందరికీ తను ఎంతో ప్రియమైన వ్యక్తి అనీ, మనకి మార్గ నిర్దేశం చేస్తూ దివిటీ పుచ్చుకుని మనముందు తను నడుస్తూంటే మనకి బలమని పదేపదే అత్తయ్యకి ఒక నమ్మకాన్ని ఇస్తూఉండాలి. ఇది మన అందరి బాధ్యత. రేపటి జీవితాలకి మనం సిద్ధపడేందుకు ఈ అనుభవం పనికొస్తుంది.’

‘ వదినా, ఇవన్నీ నువ్వు చెబితే అమ్మ ఏమంది? ఒప్పుకుందా?’

‘ ఎందుకొప్పుకోదు? ఒక్కోసారి అన్నీ తెలిసి మనం ఒక అయోమయంలో పడిపోతూంటాం. అలాటి స్థితిలో ఉంది అత్తయ్య ఇప్పుడు. అంతే. తనకి ఎలాటి అనారోగ్యం లేదని , తన మనసే తనని ఉక్కిరిబిక్కిరి చేస్తోందని అర్థం చేసుకుంటుంది.’

‘ వదినా, అమ్మని ఎప్పటిలాగా చూడాలని , మనకు తెలిసున్న ఇదివరకటి అమ్మని చూడాలని ఆశగా ఉంది.నీకు అర్థం అవుతోందా వదినా?’ శారద కన్నుల్లో ఉబుకుతున్న తడి గమనించిన వాణి వాతావరణాన్ని తేలిక చెయ్యాలని అనుకుంది.

' శారూ, చాలా సంవత్సరాల క్రితం మనమంతా తిరుమల వెళ్లినప్పుడు అక్కడ గర్భ గుడి దాటి వస్తూంటే, 'పరిమళపు అర ' గురించి విన్నాం. ఆ అర దగ్గర ఉన్న అరుగు మీద మనసులో ఉన్న కోరికని చేతి వేళ్లతో వ్రాస్తే అది ఫలిస్తుందని చెప్పేరు కదూ. అప్పుడు నువ్వు ఏమన్నావు?

'నేను ఏం కోరుకోను? నేను ఏమీ కోరకుండానే అన్నీ అమర్చిపెడతారు మీరంతా' అంటూ మమ్మల్నందరినీ విసుక్కున్నావు, జ్ఞాపకం ఉందా?...............' వాణి మాటలకి ఒక్క క్షణం అర్థం కానట్లు చూసింది. అంతలోనే, 'వదినా...........' అంటూ తడికళ్లతో నవ్వేసింది శారద.

సాయంకాలం ఆఫీసునుండి వస్తూ ఆకాశంలో ముసురుకున్న మేఘాల ముందు కూడా తల్లిని మునుపటిలా చూడాలని తను పడుతున్న ఆరాటాన్ని వెళ్లబోసుకునే వచ్చింది.

'పరిమళపు అర' ఇంతదూరాన ఉన్నతన మనసులో కోరికని ఇట్టే తెలుసుకున్నట్టుంది. చల్లని గాలుల పలకరింపుకి మేఘాలు చినుకులవుతున్నాయన్న కబురు పెరట్లోంచి మట్టి వాసన మోసుకొస్తోంది. శారద ఆనందంగా వర్షంలోకి పరుగెత్తింది.

.

**Click here to share your comments on this story**